క్లుప్తంగా

నేడు గురుకుల ప్రవేశ పరీక్షలు

చంద్రగిరి: జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు) 2023-24 విద్యాసంవత్సరానికిగాను 5వ తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశానికి ఆదివారం ఉదయం ప్రవేశ పరీక్షలు జరగనున్నట్లు చంద్రగిరి గురుకుల పాఠశాల (ఉదయమాణిక్యం) ప్రిన్సిపల్ గీతాంజలి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9000783185 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

చంద్రగిరి: మామిడి తోటలకు సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి సాధించవచ్చునని మండల ఉద్యానశాఖ అధికారిణి శైలజ అన్నారు. శనివారం ఆమె మండలంలోని భీమవరం, ఐతేపల్లి, కల్‌రోడ్‌పల్లి, ముంగళిపట్టు, చంద్రగిరిలోని మామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మామిడిలో పూత విడతలుగా రావడం వలన ప్రస్తుతం కాయ ఉసిరి, నిమ్మ, బత్తాయికాయ పరిమాణాల్లో ఉందన్నారు. సస్య రక్షణ పద్ధతులు పాటించడం వలన మంచి దిగుబడి పొందడం సాధ్యమని ఆమె రైతులకు తెలిపారు.

విగ్రహ నిర్మాణానికి విరాళం


విరాళాన్ని అందజేస్తున్న దాతలు

పాకాల: స్థానిక ఊట్లవారిపల్లికి సమీపంలోని ఆనందగిరి కొండపై నూతనంగా నిర్మిస్తున్న 54 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహానికి దాతలు విరాళాన్ని అందజేశారు. శనివారం తలారిపల్లికి చెందిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ బోర్డు మెంబర్ టి.రేవతి, టి.ఆంజనేయులు దంపతులు రూ.50,116 ఆలయ కమిటీ చైర్మన్ పట్టాభిరెడ్డికి అందజేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు మునీర్, గుండ్లూరి సురేష్, డాక్టర్ శివకుమార్, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

యాదవ యువత అధ్యక్షుడి ఎంపిక

చంద్రగిరి: అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు అన్నారామచంద్ర యాదవ్, తిరుపతి పట్టణ యువత అధ్యక్షుడు ఉదయ్ యాదవ్ చంద్రగిరి మండల యువత అధ్యక్షుడిగా తొండవాడకు చెందిన సోము యాదవ్‌ను నియమిస్తున్నట్లు శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా సోముయాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

దళిత ద్రోహులు బాబు, లోకేష్

తిరుపతి కల్చరల్: గత తెలుగుదేశం పాలనలో దళితుల పట్ల వివక్ష చూపుతూ వారిపై దాడులు చేయడమేకాక దళిత జాతిని హేళన చేసి అవమానించిన దళిత ద్రోహులు చంద్రబాబు, లోకేష్ అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ జయంతి రోజు నారా లోకేష్ దళితులు ఏమి పీకారని హేళ చేసే వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అని గతంలో చంద్రబాబునాయుడు దళితల పట్ల వివక్ష చూపారని తెలిపారు. అంతేకాక గత ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం బిల్లు అసెంబ్లీకి వస్తే నాడు చంద్రబాబు అసెంబ్లీకి గైర్హాజరవడం దళితులంటే వివక్ష కాదా అని ప్రశ్నించారు. దళితులంటే గిట్టని టీడీపీ చంద్రబాబు, లోకేష్ దళితులపై విచక్షణారహితంగా వ్యాఖ్యలు చేయడం మంచిదికాదని, ఇప్పటికైనా ఇలాంటి వ్యాఖ్యలను మానుకోవాలని లేని పక్షంలో యావత్ దళిత జాతి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

జగనన్నతో ప్రజారంజక పాలన

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి


తిరుపతి 33వ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: రాష్ట్రంలో ప్రజారంజక పాలన అందిస్తున్న ఏకైక మగ్గాడు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతిలోని 27వ డివిజన్‌లో శనివారం ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. 27వ డివిజన్లలోని ఇంటింటికి వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో తాము సంతోషంగా జీవిస్తున్నామని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు చెప్పారు. అనంతరం వారి అనుమతితో ఇళ్లకు నువ్వే మా నమ్మకం జగన్ స్టిక్కర్లను అంటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎంతో మంచి చేశారని, అందుకే ప్రజలు మనస్ఫూర్తిగా ఆదరిస్తున్నారని తెలిపారు. అనంతరం జగనన్న టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయించారు. పార్టీ నేతలు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, తొండమనాటి వెంకటేష్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, నేతలు భరణీయాదవ్, చింతా రమేష్‌యాదవ్, జేసీఎస్ అధ్యక్షుడు మద్దాలి శేఖర్, ముద్రప్రసాద్ పాల్గొన్నారు.

33వ డివిజన్‌లో భూమన అభినయ్‌రెడ్డి..

తిరుపతి 33వ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో జగనన్నకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దూది కుమారి, జేసీఎస్ అధ్యక్షుడు మద్దాలి శేఖర్, నేతలు దూది శివకుమార్, పద్మజ, లవ్‌లీ వెంకటేష్, గోవిందరెడ్డి, రఘు, రాజేశ్వరి, పసుపులేటి రవిశంకర్ పాల్గొన్నారు.

సకాలంలో అభివృద్ధి ఫలాలు అందాలి


ఇంజనీర్లతో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ హరిత

- ప్రతివారం అభివృద్ధిపై సమీక్ష
- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత

తిరుపతి తుడా: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేసి వాటి ఫలాలను ప్రజలకు అందించాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత ఆదేశించారు. కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శనివారం ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై ఆమె సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. హరిత మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. పనులను జాప్యం చేస్తే కాంట్రాక్ట్‌ను రద్దు చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయించాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈఈలు విజయకుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, సంజీవ్‌కుమార్, మహేష్, గోమతి, నరేంద్ర, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై రాయితీ పొందండి..

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని భవన యజమానులు, ఖాళీ స్థలాల యజమానులకు ఈ ఆర్థిక ఏడాదికి సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఈనెల ఏప్రిల్ 30వ తేదీలోపు చెల్లించి ఐదు శాతం రాయితీ పొందగలరని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్‌లో ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పన్నులు చెల్లించవచ్చునని, సెలవు రోజుల్లో కూడా పన్నులు చెల్లించే వెసులుబాటు కల్పించామని తెలిపారు. భవన యజమానులు ఇంటి పన్నుతో నీటి చార్జీలు, యూడీఎస్ చార్జీలు కూడా సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఖాళీ స్థలాల యజమానులు కూడా వీఎల్‌టీ పన్నులు విధించుకోవాలన్నారు.

శరవేగంగా గంగమ్మగుడి మాస్టర్‌ప్లాన్ రోడ్డు


మాస్టర్‌ప్లాన్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్

తిరుపతి తుడా: గంగజాతర వేడుకలను దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్ 30లోగా గంగమ్మగుడి మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను పూర్తిచేయనున్నట్లు నగర మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌తో కలిసి శనివారం ఆమె మాస్టర్‌ప్లాన్ రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈనెల 30వ తేదీలోపు రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లు ఆదేశించారు. మేయర్ మాట్లాడుతూ తిరుపతి నడిబొడ్డున ప్రజా రవాణాకు అత్యంత సౌకర్యవంతంగా ఉండేలా ఈరోడ్డును చేపట్టినట్లు చెప్పారు. భూమన అభినయ్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యకు కొంతమేర అయినా శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో నగరంలోని పలు కూడళ్లు, రోడ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్‌లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. నగరపాలక అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డరెడ్డి మునిశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఉదయ్ వంశీ, తులసి యాదవ్, భరణి యాదవ్, చింతా రమేష్, నగరపాలక టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు శారదంబ, సాయిలీల పాల్గొన్నారు.

దామలచెరువు సంతలో భోజనం వితరణ


సంతలో భోజనం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పాకాల: దామలచెరువు వారపు సంతలో శనివారం చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సొంత నిధులతో రైతులకు, వ్యాపారస్తులకు భోజనం వితరణ చేశారు. 12 రకాల వంటకాలను వైఎస్సార్‌సీపీ నేతలు భోజనాలను వడ్డించారు. రైతులు, వ్యాపారస్తులు మాట్లాడుతూ తమ కష్టాలను గుర్తించి ఆకలి తీర్చిన ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉంటామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ మద్దతుగా నిలిచి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా మెజారిటీతో గెలిపిస్తామని పేర్కొంటూ తమ ఆశీస్సులను అందజేశారు. జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఎంపీపీ లోక, నేతలు మునీశ్వర్‌రెడ్డి, రఘుపతి, వినాయక, రహీం, సర్పంచ్ సునిత, ఉప సర్పంచ్ ఇమ్రాన్, రమేష్ పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీ వ్యవస్థ సచివాలయాలు

తిరుపతి తుడా: ప్రజలకు జవాబుదారీ వ్యవస్థగా వ్యవహరించి ప్రజా సమస్యలను పరిష్కరించడానికి, ప్రజాభివృద్ధి పథకాలు వారికి అందేలా చూడడానికి సచివాలయ వ్యవస్థ వ్యవహరించాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. నగరంలోని ఒకటవ డివిజన్లలో ఒకటి, రెండు, మూడు వార్డు సచివాలయాలను శనివారం సాయంత్రం కమిషనర్ పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులతో ఆమె మాట్లాడుతూ మీ వార్డు పరిధిలోని సమస్యలను పరిష్కరించేంత వరకు మీదే బాధ్యతన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2023 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా జరిగింది. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం తిరుపతి గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి అధికారిక ప్రకటన చేయించడంలో ప్రత్యేక చొరవ చూపి కృషిచేసిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి పాత్రికేయులు తరఫున సన్మానం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ చిత్తూరు- తిరుపతి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు కె. రాధాకృష్ణ, కె. గిరిబాబు, తిరుపతి ప్రెస్ క్లబ్ కార్యదర్శి పి. బాలచంద్ర, ఎలక్ట్రానిక్ మీడియా మాజీ జిల్లా అధ్యక్షుడు ఆర్ మురళీకృష్ణ, సీనియర్ ఫొటో జర్నలిస్ట్ రమేష్‌కుమార్, లావణ్యకుమార్, కేతారి మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఎగ్జిబిషన్ పొటెన్‌జర్ 2కే23 అదుర్స్


ప్రదర్శనలను పరిశీలిస్తున్న చైర్మన్ కొండారెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం సీగొల్లపల్లిలోని రాయలసీమ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ఎగ్జిబిషన్ 'పొటెన్‌జర్ 2కే23'లో ప్రదర్శనలు అదుర్స్ అనిపించాయి. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తతో విద్యుత్ ఉత్పత్తిని తయారుచేసే విధానం, లేజర్ టెక్నాలజీతో ఇంటి భద్రత వ్యవస్థ, విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటూ ఎక్కువ వెలుగులు నింపే ఎల్ఈడీ బల్బుల తయారీ విధానం వంటి పలు అంశాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల చైర్మన్ వై.కొండారెడ్డి పాల్గొని ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. పవర్ జనరేషన్, ట్రాన్స్‌మిషన్ సిస్టమ్, వైర్‌లెస్ విధానంలో సెల్‌ఫోన్ల చార్జింగ్ పద్ధతుల గురించి ఈఈఈ విభాగాధిపతి బాలసుబ్రమణ్యం వివరించారు. విద్యాసంస్థల కార్యదర్శి ఆనందరెడ్డి, డైరెక్టర్ విజయ్‌రెడ్డి, ఎస్పీడీసీఎల్ సోలార్ ఇన్‌చార్జ్ దేవేంద్రనాథ్ పాల్గొన్నారు.

రుయా చిన్నపిల్లల విభాగంలో ఆకస్మిక తనిఖీలు

తిరుపతి తుడా: రుయా చిన్న పిల్లల ఆస్పత్రిలోని న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్ (అక్షయ పిల్లల ఆరోగ్య పునర్జీవ కేంద్రం)లో శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ నివాస్ ఆదేశాల మేరకు ఆయన పిల్లలకు అందుతున్న పౌష్టికాహారంపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం వార్డుల్లో సందర్శించి పిల్లలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ నాగమునీంద్రుడు, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ లక్ష్మణ్‌నాయక్, ఏఆర్ఎంఓ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతిరెడ్డి, డీఈఓ డాక్టర్ శాంతకుమారి పాల్గొన్నారు.





తోడబుట్టిన వారే నట్టేట ముంచేశారు

తిరుపతి కల్చరల్: వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికాలో స్థిరపడి అక్కడ సంపాదించింతా తోడబుట్టిన వారి మాటలు నమ్మి వారికి ఇస్తే తనను నట్టేట ముంచేశారని బాధితుడు ఎస్.మధుసూదన్‌రెడ్డి మీడియా ముందు కన్నీటి పర్యంతమయ్యారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తనకు జరిగిన అన్యాయాన్ని వెల్లడించారు. రేణిగుంట మండలం, కొత్రమంగళంకు చెందిన తాను 1999లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అమెరికాలోనే స్థిరపడ్డానన్నారు. అయితే మా అన్న, అక్క, ఆమె భర్త, నా చెల్లెలు, భర్త కలిసి తన ప్రమేయం లేకుండా పిత్రార్జితమైన భూములను, తను పంపిన రూ.10 కోట్ల రూపాయలు తీసుకుని మోసం చేశారని, నమ్మించి మోసం చేసిన వీరిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా ఫ్రోజిన్ బాటిల్ డెసర్ట్స్ కేఫ్ ప్రారంభం


ప్రారంభిస్తున్న లీనా చౌదరి, కేఫ్ అధినేతలు

తిరుపతి కల్చరల్: కరకంబాడి రోడ్డులో కొత్తగా ఫ్రోజిన్ బాటిల్ డెసర్ట్స్ కేఫ్‌ను శనివారం ఇన్‌స్టాగామ్ సెలబ్రిటీ లీనాచౌదరి, పార్టనర్స్ విక్రమ్, రూపేష్‌కుమార్ చేతులమీదుగా ఘనంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తిరుపతి ప్రజలకు అందుబాటులో తిక్ షేక్స్, ఐస్‌క్రీమ్స్, మోక్ టైల్స్, ఇటాలియన్ పాస్తా, డెసర్ట్స్‌లో అతి తక్కువ ధరల్లో లభిస్తాయని తెలిపారు. అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆలయ మహాసంప్రోక్షణ ఏర్పాట్లపై సమీక్ష

తిరుమల: మన్యంజిల్లా, సీతంపేటలో ఏప్రిల్ 29 నుంచి మే 4వ తేదీ వరకు జరగనున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ ఏర్పాట్లపై టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం సమీక్ష నిర్వహించారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం జరిగిన ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ మహాసంప్రోక్షణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అన్ని విభాగాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రచార రథాల ద్వారా చుట్టుపక్కల గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. డెప్యూటేషన్ సిబ్బందికి బస ఏర్పాట్లు చేయాలని, భక్తులకు అవసరమైన తాగునీరు, అన్న ప్రసాదాలు సిద్ధం చేయాలని సూచించారు. ఆలయం, కల్యాణ మండపం వద్ద విద్యుద్దీపాలంకరణ చేపట్టాలన్నారు. భక్తులు ఎండ వేడికి ఇబ్బంది పడకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల్లో విచ్చేసిన భక్తుల కోసం పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఆలయం వద్ద సుందరీకరణ, విద్యుద్దీపాలంకరణ చేపట్టాలన్నారు. సమీక్షలో చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, డెప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, గోవిందరాజన్, సుబ్రమణ్యం, ఎస్ఈ ఎలక్ట్రికల్స్ వెంకటేశ్వర్లు, ఈఈ శ్రీవేణుగోపాల్ వీజీఓ శ్రీమనోహర్, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తులను మోసగిస్తున్నారని ఫిర్యాదు

తిరుమల : టీటీడీ పేరుతో భక్తులను మోసగిస్తున్న 40 వెబ్‌సైట్లపై టీటీడీ ఐటీ జీఎం సందీప్‌రెడ్డి తిరుమల పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. శ్రీవారి దర్శన టికెట్లు, వసతి గదుల కేటాయింపు, ఉద్యోగాలు కల్పిస్తామంటూ సదరు నకిలీ వెబ్‌సైట్ నిర్వాహకులు భక్తులను మోసగిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గతంలోనూ టీటీడీ భక్తులను మోసగిస్తున్న 12 వెబ్‌సైట్లపై పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతోపాటుగా టీటీడీ ఐటీ సెక్యూరిటీ విభాగాన్ని ఆధునికీకరణ చేసి నకిలీ వెబ్‌సైట్లకు చెక్ పెట్టేవిధంగా టీటీడీ ఐటీ విభాగం ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు చేపట్టినట్లు ఐటీ జీఎం తెలిపారు.



